జైల్లో ఒక రోజు

ఉపాధ్యాయ

ఈదర గాలికి చలేస్తుంది.

ఎండపొడకు కుర్చీలో కాఫీ తాగుతూ కూర్చున్నా.

కాఫీతాగుడు పూర్తిచేసి చుట్ట అంటించారు నా ముందర కుర్చీలో కూర్చున్న విశ్వేశ్వరరావుగారు.

"ఆకాశం అందుకునె ధరలొకవైపు
అదుపులేని నిరుద్యోగ మింకొకవైపు
అవినీతి బంధుప్రీతి చీకటి బజారు
అలముకున్న నీదేశం ఎటు దిగజారు?"

శ్రీశ్రీ పాట పక్కనున్న రేడియో నుండి వస్తూంది.

వయసుమళ్లిన బోసినోటి విశ్వేశ్వరరావుగారికి ఆంగ్లము నేర్చుకోవాలనే వాంఛ మాత్రము సడలలేదు. ఒక పనిని సాధించటంలో అంత పట్టుదల చూపె అతన్ని అభినందించక ఉండలేను. అందుకే అతని చుట్ట పొగను భరిస్తూ, అతను తెచ్చిన ఇంగ్లీష్ ఎక్సర్‌సైజెస్‌ను సరిచేస్తున్నాను.

'సార్' అంటూ పెద్దగా ఎవరో పిలిచారు.

'ఎవరబ్బా' అనుకుంటూ వెనుదిరిగాను.

నాకనులు నేనే నమ్మలేకపోయాను.

ఎదురుగా జన్నయ్య.

చేతిలోవున్న నోట్‌బుక్ అక్కడే పడేసి 'జన్నయ్యా' అంటూ నడిచాను.

అతడు కష్టంగా 'సార్' అంటూ చూడరానిది చూసినట్లు వణుకుతూ తన చేతులతో నా చేతులు గట్టిగా పట్టున్నాడు. అతన్ని నా హృదయానికి హత్తుకున్నా.

ఇట్లా ఎంతసేపు ఉన్నామో.

చివరికి నేనే "రా, కూర్చో" అన్నాను.

బయట కుర్చీలో కూర్చోటానికి జంకాడు.

విషయాన్ని అర్థం చేసుకొని బారెక్‌లోనికి పోయాము. అప్పటికే మా చుట్టూ మంది కూడారు.

అతన్ని గురించి వివరాలు తోటి డిటెన్యూలకు చెప్పాను.

"మిమ్ముల్ను ఎందుకు తీసుక వచ్చిండ్లు, సార్ ?" కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ జన్నయ్య అడిగాడు.

"ప్రభుత్వానికి గిట్టకపోతే ఎవరైనా జైల్లో పెడుతారు" పక్కతను జవాబు చెప్పాడు.

"మీకు ఎన్నేండ్లు శిక్ష పడ్డది" తిరిగి జన్నయ్య ప్రశ్నించాడు.

"మమ్మలందరిని రాజకీయ ఖైదీలుగా నిర్బంధించారు. ఎన్ని సంవత్సరాలైనా ప్రభుత్వం మమ్మలను ఇందులో ఉంచవచ్చు."

"సార్, ఇంటికాడ అమ్మ వాళ్ళంద రెట్ల బతుకుతాండ్లు ?" అంటూ పసిపిల్ల వాడిలా ఏడ్చాడు.

ఈరోజు 'లేనివారికి సేవ చేసేవారెవరైనా ఉన్నారా ?' అని ప్రశ్నిస్తే. జన్నయ్యనే చూపిస్తా. ఎప్పుడూ ఇతరులకు సేవ చేయాలనే మనస్తత్వం. తన రిక్షాలో తరచుగా కుంటి, గుడ్డి వాళ్ళకు, రోగులకూ చోటులభిస్తూవుంటుంది. ప్రొద్దస్తమానం రిక్షా లాగినా ఆరోజు తను, తన భార్య, బిడ్డ పొట్టపోసుకో గలిగితే, అదే తృప్తి. మంచి రోజుకై కష్టాలను ధైర్యంగా, ఎదుర్కొనే ఆశాజీవి. జన్నయ్య యీ జైల్లో 'సి' క్లాస్ ఖైదీగా ఎందుకు శిక్ష అనుభవిస్తున్నాడో? అమాయకురాలైన అతని భార్య, చిరునవ్వులు చిందించే అతని పసిపాప, నా స్మృతిలో ఒక్కసారి తళుక్కుమన్నారు. నా అనే దిక్కులేని ఆ దీనుల గతి ఏమయిందో– ఈ ఆలోచన నన్ను కదిల్చివేసింది.

"ఇంట్లో అందరూ, నీ భార్యా, బిడ్డలూ బాగున్నారా ?" అని అడిగాను.

నా మాట పూర్తికాక మునుపే 'ఏమయిందిరా ?' అంటూ బయటినుండి ఎవరో కేక వేశారు–

"ఆఁ వస్తున్నా" అంటూ మంచంపై నుండి లేచాడు.

"ఏం, అంత త్వరగా పోవాలా ?"

"ఈవైపు మమ్ముల రానివ్వరు సార్, ఈరోజు జెండా వందనం కదా. అందుకే జైల్లో లడ్డూలు చేశారు. సంవత్సరం పొడుగునా తిండి సరిగా పెట్టకపోయినా, ఈ జెండా వందనం నాడు మాత్రం తలా ఒక లడ్డూ ఇస్తారు. ఇక్కడి ఖైదీలకు ఇచ్చిపోయేందుకు వచ్చిన– ఇక్కడ ఆలస్యమైతే మమ్ముల 'గంజి'ల వేసి కొడ్తరు. వీలు చూసుకొని ఇంకెప్పుడన్న వస్త"– గుక్క తిప్పుకోకుండ గబగబ అని బయటికి పోయాడు.

"ఇగో జన్నయ్యా" ఎల్లయ్య పిలిచాడు.

ఎల్లయ్య మా తోటి డిటెన్యూ.

ఆ పిలుపుకు అతను ఆగగానే "మధ్యాహ్నం ఈ బేరక్ కాడికి వచ్చి నా పేరు ఆ కాపలా జమేదారుతో చెప్పు- వాడు రానిస్తడు" ఎల్లయ్య అన్నాడు.

'ఊఁ' అంటూ నావైపు చూస్తూ గబగబా వెళ్ళిపోయాడు.

ఇతన్ని పదహారవ ఏట, ఏదో కేసు పెట్టి, జైల్లో వేస్తె ఇప్పుడు ఓటు హక్కు సంపాదించుకున్నాడు. వయసు చిన్నదైనా అనుభవం పెద్దది. పోలీసులు పెట్టిన ఒక్కొక్క చిత్రహింస అతని వయసులో ఒక్కొక్క గ్రీష్మాన్ని పెంచింది. ఏ విషయమైనా స్పష్టంగా మాట్లాడే స్వభావం.

"జన్నయ్యకూ మీకూ పరిచయం ఎట్లా కలిగింది?" మా బారెక్‌లో ఒకరు ప్రశ్నించారు.

"ఇంతకు పూర్వం నేను వీరి గ్రామంలో పని చేశాను. ఆ గ్రామస్తులు చాలా మంది బీదవారు. నిరక్షరాస్యులు. వారందరూ అక్కడి భూస్వాముల పొలాల్లో కూలీలుగా పనిచేస్తారు. కొందరు బండ కొడుతారు. మరికొందరు రిక్షా తొక్కుతారు. వారి పిల్లలు కేవలం పాఠశాలలో పెట్టే మధ్యాహ్నపు భోజనం కోసం పాఠశాలకు వస్తారు. వుళ్ళో కొందరు యువకులైన కూలీ పనివారు చదువుకోవాలని తహతహలాడేవారు- వారందరినీ చేరదీసి ఒక రాత్రి పాఠశాల ఏర్పాటు చేశాను- అందులో ఇతడు ఒక విద్యార్థి."

మధ్యాహ్నం ఒకటయింది.

వంట హాల్లో గంట మోగింది.

కాపలా జమేదార్ ఎల్లయ్యను చూసి నమస్కారం చేశాడు- అతని పక్క జన్నయ్య ఉన్నాడు- ఎల్లయ్య వారిద్దరినీ భోజనాల గదికి తీసుకవచ్చాడు. భోజనాలు అయినాక బారెక్స్‌కు వెళ్ళాము. జన్నయ్య నాతో వచ్చాడు.

"ఎందుకు జైలుకు వచ్చావు? ఏం జరిగిందో చెప్పు" అతన్ని గూర్చి అన్ని విషయాలు త్వరగా తెలుసుకోవాలనే కుతూహలంతో ప్రశ్నించాను.

"రెండేండ్ల కింద" జన్నయ్య తన కథ మొదలుపెట్టాడు- "తుఫాను వల్ల కావచ్చు ఒకటే ముసురు- ఆరోజు సవార్లు దొరుకుడే కష్టమయింది. ఎంత ఇబ్బంది పడ్డా రెండు రూపాలకంటె ఎక్కువ సంపాయించలేక పోయాను- ఎంత బతిమిలాడినా

రిక్షా సేటు ఆరోజు కిరాయి ఇవ్వందే ఒప్పుకోలేదు. విధిలేక ఆరోజు కిరాయి రూపాయిన్నర ఇచ్చి అక్కడి నుంచి వెళ్ళబోయాను. మా సేటు పక్కనున్న డబ్బా చూపుతూ రాబోయే గోయింద్రాల పండుగనాటి దేవుని ఖర్చుకై తలా రూపాయి చందా వేయాలనీ రిక్షా వర్కర్సు అందరూ అలాగే చేస్తున్నారనీ చెప్పాడు. నావద్ద అర్ధరూపాయి మాత్రమే ఉందనీ, నేను ఇవ్వలేననీ ఎంత గీమాలినా తప్పక ఇవ్వాలనీ బలవంతం చేశాడు.

"చందాకు బలవంతమేంది? ఇవ్వనంటె వాడేం చేస్తడు?"

పక్కనున్న రాజయ్య మధ్యలో ప్రశ్నించాడు.

రాజయ్య కాలేజి స్టూడెంట్. రెండేండ్ల కింద ఒకనాడు పోలీసులు ఒక అమ్మాయిని బలవంతం చేస్తూ ఉంటే వాంతో దెబ్బలాడి ఆ అమ్మాయిని క్షేమంగా యింటికి పంపించాడు. అదనుచూచి ఎమర్జెన్సీలో 'మీసా' కింద లోపల తోసేశారు.

"చందా ఇవ్వనంటే మరునాటి నుండి రిక్షా ఇవ్వనంటాడు" జన్నయ్య జవాబు.

"వానిమీద ఆధార పడటమేంది? ఏదైన బ్యాంక్‌నుండి అప్పుతీసుకొని రిక్షా కొనుక్కోక పోయావా?" తిరిగి రాజయ్యే ప్రశ్నించాడు.

"బ్యాంక్‌నుండి అప్పంటే మాటలుకాదు సార్. దానికి పెద్దపైరవీ. కనీసం రెండు మూడు వందలరూపాయలు ఖర్చు అయితవి. తీరాఇంతచేస్తే జమానతు కావాలంటరు.

"కాలుకుపెడితే మెడకు, మెడకుపెడితే కాలుకుపెడతరు. వీటకిఏగలేక రోజుకి రాయేనయమనిపిస్తుంది. మాపేరుమీద ఆరిక్షాసేట్లే బ్యాంక్‌నుండి అప్పు తీసుకుంటరు." జన్నయ్య చెబుతూ పోతున్నాడు. "చివరకు మిగిలిన అర్ధరూపాయి ఆ డబ్బాలో పడవేశాను మిగిలిన అర్ధరూపాయి రేపుఅందులో వేయమని మా సేట్‌చెప్పే మాటలు విన్నప్పుడు నాకు ఒళ్లుమండింది. పేదవానికోపం పెదవికి చేటు అనుకొని ఇంటిమొగం పట్టాను. పది రోజుల్నుండి జ్వరంతో బాధపడి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న నాభార్య, నిన్నటి నుండి జ్వరంతో మాబుజ్జి గుర్తుకువచ్చిండ్లు. నిన్నటినుండి మందులేదు. డాక్టర్ దగ్గరకు పోవాలంటే డబ్బుకావాలి. మాబుజ్జి ఎలావుందో ఏమో.... నిన్నటినుండి ఉపవాసమే. కొంచెం జొన్నలో, నూకలో కొంటేతప్ప ఈరాత్రికీ, రేపు పొద్దుటికి వెళ్ళదు. జేబులో పైసాలేదు. ఇట్లా అనుకుంటూ నడుస్తున్నా. దారిలో మిఠాయికొట్టు ముందరికి రాగానే ఏక్‌దం ఆగిపోయాను. అనుకోకుండా నాచేయి జేబులోకి పోయింది. మాబుజ్జికి రోజూ సాయంకాలం పదిహేనుపైసల బూంది తీసుకపోయేవాణ్ణి. ఈరోజు ఆపదిహేను పైస

544

లన్నా లేనందుకు మనసు బాధగావుంది. ఆ కొట్టోడు ఉద్దెరఇవ్వడు. బాధతో నన్నునేను తిట్టుకుంటూ ఇంటికివస్తున్నా.

"అరే, జన్నా!" అంటూ కోమటికేక వేసిండు. సడెన్ బ్రేక్ వేసినట్లు ఆగిపోయాను. "ఇయ్యాలట్ల కడకడకు దాక్కుంట బోతాన వేందిరో! బాకి సంగతి ఏమైందిరా!" అంటూ పిలిచిండు ఆరోజు పరిస్థితి అంతాచెప్పి పిల్లలకు జ్వరంవచ్చింది, నిన్నటినుండి తిండిలేదు- కిలో నూకలియ్యమని బతిమిలాడిన.

"మీకు అప్పుపెట్టుడే బుద్ధితక్కువరా- మాదిగమాట నీల్లమూట- మీరిట్ల అవద్ద మాడుతరు కాబట్టేమీకు బరకతుండదిరా- ఇదువరకిచ్చినై ముడ్డికింద పెట్టుకొని మల్ల నూకలియ్యంటానవ్- వాటికి ఇవి వడ్డారా అడిగేతందుకు సిగ్గయిన ఉండాలి- ఛో ఛో!" అంటూ కసిరిండు.

ఒక కిలోనూకలు ఉద్దెర ఇవ్వమని ఎంత కాల్లావేల్లా పడ్డా ఇవ్వనంటే ఇవ్వనన్నాడు- చేసేదిలేక ముందుకు అడుగేసిన- "అరే" అంటూ తిరిగి కేకవేసిండు.

"ఎవలకు ఎనుకముందు చేసిన ఎల్తది గాని, షావుకారికి ఎనుకముందు చేస్తే నీ కంచాల కెట్లస్తదిరా! నీకు చేతికి ఇయ్యబుద్ది కాకుంటె కిందపారెయ్- రేపు ఈపాటికి నాబాకీ ఇయ్యవో మర్యాద దక్కదు- లంజాకొడుక" అనితిట్టి దుకానం పనిలో మునిగి పోయాడు- ఈరోజు ఈగండం తప్పించుకొని ఇల్లుచేరాను- ఎదురుగా వచ్చే మాబుజ్జికిబదులు నాకోసం కాచుక కూచున్న కాంపౌండరూ గిదిగిరి చిట్టాయనా ఎదురయినప్పుడు నాకు ఆశ్చర్యం వేయలేదు.

ఆరోజు నా పరిస్తితి చెప్పి రేపు వారికి తప్పక ఇస్తానని బతిలాడాను.

"అరె జన్నా! అయ్యవ్వ సచ్చి పతార ఉండాలంటబ్రా- శరబోయైన అన్న వాయిదకు ఇచ్చి మాట నిలబెట్టుకోవాల్రా- ఎవరికైన బాకీ ఆపచ్చు గాని మాకు ఆప వచ్చురా? మాట పాబంది లేకుంటె మరి పూటకు చేతుల ఉచ్చన్న పోయబ్రా" నోటికి వచ్చినట్లు అంటూ గిరిగిరి చిట్టాయన వెల్లిపోయిండు

"అరే, నీ పెండ్లాం సచ్చేది బతికింది- డాక్టరు ఎన్నో ఖరీదైన మందు లిచ్చిండు- అసలు ఎప్పటి పైసలు అప్పుడు తీసుకునేదే- ఏదో గరీబోడవని రెండొద్దు లాగుతె, ఇంక రెండొద్దులంటివి- రెండొద్దులు వోయి ఇప్పటికి పదాయె- నీ పెండ్లాం లేచి ఇటుఅటు తిరుగబట్టె. మా పైకం ఇంక రాకపాయె- ఎసొంటోల్లకైన వాయిదా పెట్టొచ్చు కాని డాక్టరుకు వాయిదా పెట్టొచ్చా? మరోసారి రోగం వస్తే

ఏముఖం పెట్టుకొని వస్తవు? న్యాయం ఉండాల్రా. ఈ లోకంమీద న్యాయం మస్లె కల్సింది గాబట్టే ఓ దిక్కు కాలంగాక సత్తంటె, మరో దిక్కు వరుదలొచ్చి కొట్టుక పోతాండ్లు. సరెగాని మా పైసలు ఎప్పుడిస్తవో ఖచ్చితంగా చెప్పు" అంటూ ఆ కాంపౌండరు పట్టుబట్టాడు.

తప్పక రెండు రోజుల్లో ఇస్తానని చెప్పాను.

"మేము నీ వన్నట్లు రెండు లోజులాగుతము కాని మా కిచ్చినోడు ఆగు తాడా? మేము మీ తరాగ బొంకుతె వాడు మా పెండ్లాల...." అని బండబూతులు తిడుతూ, "ఎల్లుండి ఇవ్వక పోతే చూస్కో" అంటూ వెళ్లిపోయాడు.

"ఇది మాకు మామూలే- రోజూ నాకు ఎదురుగా వచ్చే మా బుజ్జీ ఇప్పుడె ట్లుందో- కడుపకాడ నిల్చుని నా భార్య ఏడుస్తూ కనపడింది.

"బుజ్జి ఎట్లుంది?" అని అడిగిన.

"అరే, డిప్టీ జైలర్ వస్తాండు" అంటూ వార్డర్ పరుగున వచ్చి చెప్పాడు.

పోలీసు కాన్‌సెంట్రేషన్ క్యాంపుకు కొత్తగా పట్టి తేబడిన వానిలా జన్నయ్య వొణికిపోయాడు.

"ఈ మంచాల పండుకొని నిండ దుప్పటి కప్పుకో" ఆ వార్డరే సలహా ఇచ్చాడు.

మరుక్షణంలో జన్నయ్య అలాగే చేశాడు.

ఆ డిప్టీ జైలర్ ఒకసారి అన్ని బారెక్స్ చుట్టిపోయాడు.

మధ్యమధ్యన డిప్టీ జైలర్లు అలా వచ్చి పోవడం ఈ జైల్లో పరిపాటి.

"అరె, జన్నా! ఇంక ఎంతసేపుంటవు బే" అంటూ జమేదారు బారెక్ లోపలికి వచ్చాడు.

కొద్దిలో తప్పిపోయిన ప్రమాదం నుండి తేరుకున్న వాడిలా జన్నయ్య వొణు కుతూ మంచం నుండి లేచాడు.

ఆ జమేదారు జన్నయ్య వైపు ఉరిమి చూశాడు.

"పోతాన సార్" అంటూ జన్నయ్య కదిలాడు.

"ఇంకొద్దిసేపుంటె నీకేమయితాంది?" రాజయ్య కరుకుగా జమేదారును మంద లించాడు.

"ఇప్పటోడు చూస్తే మాకు రిమార్కు వస్తది సార్. టీ వేలకు పంపిస్తా" అంటూ నసుగుతూ బయటికి వెళ్ళాడు

ఈ మాటల సందర్భంలో జన్నయ్య ఎప్పుడు జారుకున్నాడో।

"ఈ లంజా కొడుకులకు రిమార్కొస్తదట- చేసేవన్నీ ఎదవ పనులు- చెప్పేవి నీతి సూత్రాలు" మా వార్డుకు వార్డర్‌గా ఉన్న చంద్రం అన్నాడు.

చంద్రం ఏదో టైర్ల ఫ్యాక్టరీలో వర్కర్. తమ న్యాయమైన హక్కులకోసం యాజమాన్యానికి వ్యతిరేకంగా జరిగిన సమ్మెకు నాయకత్వం వహించాడని పని నుండి తొలగించారు- అయినా కార్మికులు సమ్మె ఆపలేదు- దాంతో పిచ్చెక్కిన యాజమాన్యం గుండాలతో నాయకుల ఇళ్ళపై దాడి జరిపించారు- ఫలితంగా ఎందరో గాయపడ్డారు- చంద్రం భార్యా, బిడ్డలు ఆ దొమ్మీలో చనిపోయారు- కార్మికులు రెచ్చిపోయి యజమాని యింటిమీద దాడిజేశారు- ఆ దాడిలో యజమాని చచ్చిపోయాడు. ఈ కేసులో చంద్రానికి యావజ్జీవ శిక్ష పడింది.

"జైల్లో, యీ జమేదార్లకి ఖైదీలను కుంచే అవకాశం ఏముంటుంది?" నేనే ప్రశ్నించాను.

చంద్రం చిన్నగా నవ్వాడు.

"ఖైదీలలో చాలా మంది ఏదో ఒక అలవాటుకు బానిసైపోతారు- ఆ అలవాట్లు తీర్చుకోవాలంటె ఈ జైలు సిబ్బంది ద్వారానే సాధ్యమవుతుంది- అప్పుడప్పుడు ఖైదీలకు ఇండ్ల నుండి వచ్చే డబ్బుతో వారికి కావలసినవి తెచ్చి పెడతారు."

"ఏమేమి తెస్తారేమిటి?"

"పొగాకు, గంజాయి, సారా, పత్తాలు యిలాటి వేవైనా తెస్తారు. కాని రూపాయి సొమ్ముకు నాలుగు రూపాయిలు రాబడుతారు- అంతేకాదు కొందరు ఖైదీల వద్ద డబ్బు లేకుంటె వారి చొక్కాలు, పేంట్లు తీసుకొని రెండుమూడు బీడీల కట్టలిస్తారు."

"అవన్నీ చూస్తూ అధికారులు ఎలా సహిస్తున్నారు?"

"వాళ్ళు పెద్ద దొంగలు సార్. వాళ్ళు చేయని యెదవ పనంటూ ఉండదు. జైలు కార్ఖానా నుండి బోలెడు వస్తువులు కాజేస్తారు- ఖైదీల రేషన్ నుండి సరేసరి- ఇందులో పైనుండి కింది అధికారిదాకా వాటాలుంటాయి- ఖైదీల తిండి ఎంత అధ్వాన్నంగా ఉంటుందో చెప్పలేము- రాళ్ళు పురుగులూ అబ్బబ్బ! అసహ్యం."

"మీకు ఇచ్చే ఆహారాన్ని డాక్టర్ పరీక్ష చేయరా?"

మా చుట్టూ కూచున్న వాళ్ళందరూ గొల్లుమన్నారు.

"ఎంత అమాయకులు సార్ మీరు. వాడుకూడా ఈ జైలు సిబ్బందిలో ఒకడే కదా! వాని వాటా వాడికి ముట్టినాక, ఖైదీలతో, వారి ఆరోగ్యంతో వాడికేంపని?"

"ఈ జైలు సిబ్బంది మిమ్మల్ని అంత దారుణంగా చూస్తుంటే మీరంతా ఒకటై దానికి నిరసన తెలియజేయవచ్చు కదా ?"

"మాకు ఆహారం సరిగా ఇవ్వటంలేదని ఒకసారి పదిమందిమి నిరాహారదీక్ష పట్టినం- అందుకు జైలు అధికార్లు మండిపడి మా అందరి చొక్కాలు ఊడదీసి చితుగ్గొట్టి గంజిలో వేశారు, అయినా మా పట్టుదల సడలలేదు- ఎనిమిదవ నాటికి మాలో కొందరు చాలా నీరసపడిపోయారు- విషయాన్ని గ్రహించిన అధికార్లు డాక్టరుతో వచ్చి బలవంతంగా నోళ్ళలో ఇనుపకడ్డీలు పెట్టి పాలు పోశారు- ఈ రకంగా ప్రాణాలు పోకుండా చేశారు- మా విషయాలు పట్టించుకునేవారు బయట ఎవరూలేరు. అందుకే యిక ఫలితం లేదని విధిలేక నిరాహారదీక్ష విరమించుకున్నాం."

చంద్రం తన యావజ్జీవ జైలుశిక్ష అనుభవాల పుటలు చదువుతున్నాడు.

"వీరి పై అధికార్లు జైలును ఎప్పుడూ తనిఖీ చేయరా ?"

"వాళ్ళు గజదొంగలుసార్. వాళ్ళు రాంగానే ఘనంగా పార్టీలు ఏర్పాటుచేసి, వారి వాటా వారికి ముట్టచెప్పుతరు- అంతే, ఖైదీల విషయం ఎవడూ పట్టించుకోడు. అయినా వాళ్ళు ఇన్‌స్పెక్షన్‌కు వచ్చేది ఖైదీల బాగోగులు విచారించేందుకు కాదు- వారి వాటాలు తీసుకపోయేందుకు...."

చంద్రం చెపుతూ పోతున్నాడు.

"డాక్టరొచ్చిండు" జవాను మా వద్దకు వచ్చి చెప్పాడు.

వారాని కొకసారి డాక్టర్ వార్డ్సులోకి తన అట్టహాసంతో వచ్చి పోతుంటాడు. వారి కుర్చీలు, టేబుల్స్ మోసేందుకు నలుగురు మనుషులు- వారు తెచ్చే మందుల ట్రే మోసేందుకు ఒకరు- ఇదీ వారి హంగామా.

రోగాలన్నిటినీ డాక్టరుగారు తమ ప్రావీణ్యంతో రెండు మూడు గ్రూపులుగా విభజించినట్లున్నారు- ఏ రోగానికైనా రెండు మూడు రకాల టాబ్లెట్లనే ఇచ్చి తమ వంతు పని పూర్తిచేసుకొని వెళ్ళిపోతారు- అందుకే చాలా మంది ఓపెన్యూలు డాక్టరు వద్దకు వెళ్ళరు.

డాక్టర్ ఆ వారం పని పూర్తిచేసుక వెళ్ళిపోయాడు.

'టీ' వేళకు గంట మోగింది- జన్నయ్య మళ్ళీ వచ్చాడు.

"అన్నట్లు జన్నయ్యా, నీ బిడ్డ సంగతి చెప్పుతున్నావు కదా." 548

తన కథ మొదలుపెట్టాడు జన్నయ్య.

"బుజ్జి ఎట్లుందని అడిగానే కాని నా భార్య సమాధానం వినకుండానే ఇంట్లోకి పోయాను. గుడ్డిదీపం వెలుతురులో చినిగిన చాపలో శవంలా పడివుంది బుజ్జి. ఒక రోజంతా పూర్తిగా తిండిలేదు- మందులేదు- పక్క ఇంటినుండి కాస్త గంజి అడిగి తెమ్మని నా భార్యతో చెప్పాను "

ఇంతకు ముందే ఎక్కడ తిరిగినా గంజి దొరుకలేదని చెప్పింది.

"బాకీ కట్టంది దుకానవోడు సూకలియ్యడు- డాక్టర్ మందివ్వడు- ఎటూతోచని స్తితి. ఏమి చేయాలో అర్థం కావటంలేదు."

"సర్కారు దవాఖానాకు తీసుకపోకపోయినవా ?" మాలో ఎవరో ప్రశ్నించారు.

"ప్రైవేట్ దవాఖానలో అయితె ఒక్క డాక్టరుకే ఫీజు ఇచ్చుకోవాలి. సర్కారు దవాఖానలో కింది నుండి పైదాక ముడుపులు చెల్లించుకోవాలి- 'సర్కారు దవాఖాన'." మూడుఏళ్ళ క్రితం అక్కడి డాక్టర్ల నర్సుల నిర్లక్ష్యానికి తన రెండేండ్ల కొడుకు బలైపోయిన భయంకరమైన అనుభవం జ్ఞాపకానికి వచ్చి అతని ఒళ్ళు జలదరించింది.

"మా బుజ్జికి జ్వరంలోనే కింకలు వచ్చినట్లున్నవి- కళ్ళు అదోలా తిప్పుతున్నది- మెడలు ఎగురవేస్తున్నది- పండ్లు బిగపట్టింది- నోటి నుండి సొల్లు వస్తున్నది- చూస్తూ ఊర్కోలేక మా బుజ్జిని తీసుకొని మా ఊరి ప్రైవేటు డాక్టరువద్దకుపోయాను.

నన్ను సూసే సూసుడే మండిపడ్డడు- ఎంత కాల్లయేల్ల పడ్డా పైసలివ్వంది మందు ఇవ్వనని కరాకండిగా చెప్పిండు.

మా బుజ్జిస్తితికి బాధ, వాడు మందు ఇవ్వనన్నందుకు కోపం, నా చేతగానితనానికి నాపైనాకే అసహ్యం ఒక్కసారి నా మనసులో మెదులగా ఇంటికి చేరుకున్నాను.

"సూది ఇప్పించావా" అంటూ నా భార్య ఎదురయింది.

ఎదురయిన నా భార్యకు బుజ్జిని అందిచ్చిన-

కారు చీకటి- ఆకాశంలో ఒక్క చుక్క గూడ లేదు. బయటికి నడిచాను- ఎంత దూరం పోయానో ఏమో.... మెరుపు మెరిసింది- దూరంనుండి ఎవరో సైకిలు మీద వస్తున్నారు- నేను రోడ్డుపై ఉన్నట్లు గుర్తించాను- ఉరుము ఉరిమింది- మెదడు పనిచేయడం మొదలుపెట్టింది- మెరుపు మెరిసింది- సైకిలు దగ్గరయింది- ఒక్కపాటున సైకిలుమీద పోయేటాయనను కిందికి లాగిన- అతన్ని గట్టిగా పట్టుకొని డబ్బు ఇయ్యమని అడిగిన- అతను ఏదో అనబోయిండు- అతని మాటకు ఎదిరిచూడకుంటనే అతని జేబులు వెదికిన.

అతని జేబులో దొరికిన పాకెటు తీసుకొని ఇంటిదిక్కు పరిగెత్తిన-

"ఎలాగైన మా బుజ్జిని బతికించుకోవాలి- అదొక్కటే నా కోర్కె-"

"ఎంత తొందరగ మా యింటికి పరిగెత్తిన్నో, అంత కటుక్కున ఆగిపోయిన."

"చీకటిలో మా యింటి ముందట ఎవరో దీపం పెట్టిన్రు- తల బాదుకుంట ఏడ్చే నా భార్య, చుట్టూ మూగిన జనం మధ్యన మా బుజ్జి శవం- ఒక్కసారిగా మా బుజ్జిపై బడ్డాను- ఎంతసేపున్ననో।"

"ఎవరో వచ్చి ఎనుక నుండి నన్ను తట్టి లేపిన్రు- తీరా చూసేసరికి పోలీసులు, వార్రి పక్కన గిరగిరి చిట్టీ యజమాని."

కళ్ళ నుండి ఏకధారగా వచ్చే కన్నీటిని చొక్కాతో తుడుచుకున్నాడు జన్నయ్య.

'ఆపై కథ మామూలె'- జన్నయ్య తిరిగి మొదలు పెట్టాడు. "పోలీసుల దెబ్బలు, చిత్రహింసలు- అంతేకాదు వాళ్ళు నన్ను మరో రెండు దొంగతనాలు చేసినట్లు ఒప్పుకొమ్మన్నారు- అందుకు వినకపోతే ఖూనీ కేసు పెడ్తమని బెదిరించారు- చివరకు నాకు మూడేండ్ల శిక్ష వేయించారు."

"నీ భార్య ఇపుడు ఏం చేస్తున్నది?" ఎవరో అడిగారు.

"పిచ్చిదయింది" అంటూ ఏడ్చాడు.

నాకూడా కన్నీళ్ళు ఆగలేదు.

"జన్నా పదరా"అంటూ జవాన్ లోనికివచ్చాడు.

"సార్, నేనువిడుదల అయినంక నాకుటుంబాన్ని నాశనంచేసిన ఆ డాక్టర్ను, గిరిగిరి చిట్టోన్ని వాల్లందర్ని ఖతంచేసి తిరిగిఇదే జైలుకువస్త- అంతవరకు నాకోపం చల్లారదు." పిడికిలిబిగించి బిగ్గరగా అన్నాడు. కండ్లు ఎరుపెక్కాయి.

"జన్నయ్యా! ఈదేశంలో మనలాంటి లేనివారు చాలామంది ఉన్నారు. ప్రతీ వ్యక్తీ ఏదోరకంగా ఉన్నవారి దోపిడికి గురిఅవుతూ, అనేకరకాల బాధలకు బలిఅవుతూనే ఉన్నాడు లేనివాడు. ఒంటరిగా ఏమీచేయలేడు. నీవన్నట్లు ఆ డాక్టర్, గిరిగిరి చిట్టీ యజమానిలాంటి వారిని నీవు ఖతంచేసి సాధించేది ఏమీలేదు- వారుపోతె వారి స్థానంలో కోకొల్లలు. కాబట్టి లేనివారందరు ఒకటై ఉన్నవాడికి వ్యతిరేకంగా పోరాడి యీ దోపిడి వ్యవస్థను రూపుమాపాలి."

నామాటలు వింటూ జన్నయ్య చీకటిలో తన బారెక్సువైపు నడిచాడు ఆకాశంలో నక్షత్రాల వంక చూస్తూ.

*

(ఇటీవల వరంగల్ సెంట్రల్‌జైల్లో జైలుఅధికార్ల దౌర్జన్యానికీ, అత్యాచారాలకూ వ్యతిరేకంగా సాముహికంగా పోరాడిన ఖైదీలందరికీ యీకథ అంకితం.)

550